

ఎర్ర జుట్టు కోడి పుంజు





ఎర్ర జుట్టు కోడి పుంజు

కరేలియన్ కథ



కథనం: వీక్తొర్ వజ్డాయెవ్

"రాదుగ" ప్రచురణాలయం

మాస్కో



అనగనగా అనాథులైన ఓ అన్నా, చెల్లెలూ వుండేవారు. వాళ్ల అమ్మా, నాన్నా చనిపోయేముందు ళ్లకి మిగిల్చిన ఆస్తి అల్లా ఓ ఎఱ్ఱ జుట్టు కోడి పుంజు మాత్రమే.

కొన్ని రోజులకు యిల్లు అయ్యవార్లంగారి నట్టిల్లులా తయారై, చివరకి ఓరోజున కొంపలో ఓ రొట్టె తుంపు ౘడా లేకపోయింది. అప్పుడు అన్న చెల్లెలితో యిలా అన్నాడు:

“గాదెలోకి పోయి చూడు, గింజలేమైనా దొరుకుతాయేమో; నాకు ఆకలి దహించుకుపోతోంది!”

ఆ అమ్మాయి గాదెలో చూసింది, కాని అది ఖాళీగా కనిపించింది. అందుకని ఆమె చీపురుతో గాదె అంతా ఊవడం మొదలుపెట్టింది. తుడవగా తుడవగా ఒకే ఒక్క రైగింజ దొరికింది.

ఆమె ఆ గింజను తన అన్నకి చూపించింది. వాళ్లు దాన్ని నాటాలని నిర్ణయించుకున్నారు.

ఇంటి వెనకాల వాళ్లు ఓ గుంట తీసి, దానిలో రైగింజను పాతి, గుంటను మట్టితో కప్పెట్టారు.

మర్నాటి ఉదయం పెందరాళే లేచి అన్న దొడ్లోకి వెళ్లి చూశాడు కదా, చిత్రంగా అక్కడ ఓ దేవదారు వృక్ష త కాండంతో రైచెట్టు తల ఆకాశాన్ని తాకుతూ కనిపించింది!

“బలే వింతగా వుందే! ఆ పైన ఏముందో చూసొస్తాను” అనుకున్న ఆ అబ్బాయి చెట్టుపైకి ఎక్కడం ౘలెట్టాడు.

అతను ఎక్కి ఎక్కి మబ్బుల్ని చేరుకున్నాడు. చెట్టుతల మబ్బులను చీల్చుకొని, యింకా పైకి ఎదగడం చూశాడు. అప్పుడు వాడు ఆ మబ్బులపైగా నడిచిపోయాడు.

అలా నడుస్తూ నడుస్తూ పోగా పోగా వాడికి ఓ చిన్న యిల్లు కనిపించింది. వాడు ఆ యింటి తలుపు తెరిచి ‌కి వెళ్లాడు. అక్కడో మూల పరమ వికారంగా వున్న ఓ ముసలమ్మ కూర్చునివుంది. దానికి ఒకే కన్ను వుంది. యలా ఉబ్బివున్న ఆ కన్ను గద్ద కంటిలా మిలమిల మెరుస్తోంది.

ఆ ముసల్ది తిరగలి విసురుతోంది. తిరగలి మధ్యనుంచి అట్లూ, కేకులూ ఎగిరెగిరి పడుతున్నాయి!

ఆ ముసలమ్మకేసి చూడటానికి భయంగావేవున్నా అది అట్లనూ, కేకుల్నీ ఎగరకొడుతున్న తీరుచూస్తే నవ్వుబుద్దేస్తుంది.

ఆ అట్లూ, కేకులూ గది నాలుగు మూలలా రంయ్‌మని ఎగురుతూపోయి పొయ్యిపక్క నిటారుగా వున్న పడుతున్నాయి.

ఆ కుఱ్ఱాడు మాంచి ఆకలిగా వున్నాడేమో, మరేమీ ఆలోచించకుండా, సంచిని చేతో దొరకపుచ్చుకొని, ంద వేసుకొని, పరుగు లంకించుకున్నాడు. పరుగెత్తి పరుగెత్తి రైచెట్టు కాండాన్ని చేరుకొని, దానివెంట ుకాలంలో నేలమీదకి దిగిపోయాడు.





''చూశావా, నేనేం తెచ్చానో!'' అన్నాడు వాడు తన చెల్లెలితో.

వాళ్లకిప్పుడు సంచీడు అట్లూ, కేకులూ వున్నాయేమో చాలా రోజులపాటు వాళ్లకి తిండికి కొరత లేకుండా పోయింది. అయితే కూర్చుని తింటే కొండలైనా తరిగిపోతాయంటారు. చివరకి ఓ రోజున సంచిలో చెయ్యి పెట్టి చూస్తే ఏముంది, అంతా ఖాళీ!

మరి యిప్పుడింక ఏం చెయ్యాలి! ఆకలితో పస్తులుండలేరు కదా. అందుకని ఆ అబ్బాయి మళ్లీ రైచెట్టెక్కి పైకెళ్లాలని నిశ్చయించుకున్నాడు.

''నీతోబాటు నన్ను కూడా తీసుకెళ్ళు అన్నయ్యా!'' అని అడిగింది చెల్లెలు.

''నిన్ను నేను తీసుకెళ్లను. ఆ ముసిల్దాన్ని చూసి భయపడి నువ్వు అరవనైనా అరవవచ్చు, లేక దాని తిరగలిని చూసి పకాలున నవ్వనైనా నవ్వొచ్చు. దానితో మనం పట్టుబడిపోతాం'' అని అభ్యంతరం చెప్పాడు అన్న.

కాని చెల్లెలు అతన్ని మరోసారి బతిమాలింది:

''నేను అరవనూ అరవను, నవ్వనూ నవ్వను, సరేనా. నన్ను కూడా తీసుకెళ్ళు అన్నయ్యా!''

సరే అతను ఆమెను తనతో తీసుకెళ్లాడు. ఇద్దరూ కలిసి రైచెట్టు కాండంవెంట పైకి ఎక్కడం మొదలెట్టారు. వాళ్ళు ఎక్కి ఎక్కి ఆకాశాన్ని చేరుకున్నారు. మబ్బులపైన దిగి బాట వెతుక్కొని, దానివెంట నడవసాగారు.

వాళ్ళు నడిచి నడిచి వెళగా వెళ్లగా చివరకు ఆ చిన్న యింటిని చేరుకున్నారు.

వాళ్లా యింట్లో ప్రవేశించారు. అక్కడ ఓమూల తిరగలి విసురుతూ పరమ వికారంగావున్న ముసల్ది కూర్చుని వుంది. ఆమెకు ఒకే ఒక కన్ను వుంది. పత్తికాయలా ఉబ్బివున్న ఆ కన్ను గద్ద కన్నులా మిలమిల మెరుస్తోంది.

''బాబోయ్, నాకు భయమేస్తోంది!'' చెల్లెలు సన్నగా అరిచింది.

కాని అన్న ఏమీ బదులు చెప్పకుండా, ఆ ముసల్ది తమ సవ్వడి వినవచ్చుననీ, అప్పుడు తాము చిక్కుల్లో యిరుక్కుంటామనీ జ్ఞాపకం చెయ్యడానికా అన్నట్లు, తన చెల్లెల్ని మెల్లగా మోచేత్తో పొడిచాడు.

ఆ ముసల్ది తిరగలి పిడి పట్టుకొని తిప్పుతూనేవుంది. వింతల్లో వింత! అట్లూ, కేకులూ దాని సందునుంచి వరుసగా బయటపడి రంయ్మన గాల్లో ఎగురుతున్నాయి. చెల్లెలికి యీ దృశ్యం విచిత్రంగానూ, విడ్డూరంగానూ కనిపించడంతో ''హ్హి హ్హి హ్హీ!'' అంటూ కిసుక్కున నవ్వింది.

ఆమె అంత పెద్దగా నవ్వకపోయినా ఆ ముసల్ది వింది. ఆ అన్నాచెల్లెళ్లకేసి తిరిగి యిలా గట్టిగా అరిచింది:

''ఆహా! దొరికారు దొంగలు! నా అట్లూ, కేకులూ అన్నీ ఎత్తుకుపోయింది మీరన్నమాట!''

అన్నాచెల్లెళ్లు భయంతో బిక్కచచ్చిపోయి నిలబడ్డారు. వాళ్ల ప్రాణాలు పైకే పోయినట్లయింది.

ముసల్ది నెగడి అంటించింది.

''నేను మిమ్మల్ని దోరగా కాల్చుకుని కమ్మగా తింటాను. కుర్రాడా నువ్విలా రారా ముందు, వచ్చి యీ షవల్‌మీద కూర్చో, ముందు నిన్ను నెగడిలో వెయ్యాలి!''

కుర్రాడు షవల్‌మీద కూర్చున్నాడు గాని కాళ్లను పంగజాపాడు, చేతుల్ని బారజాపాడు. దానితో ముసల్ది ఎంత ప్రయత్నించినా కూడా వాడిని నెగడిలోకి నెట్టలేకపోయింది.

అప్పుడు ఆ ముసల్ది యిలా అంది:





''ఒరే, నువ్వంతా తలకిందులుగా చేశావురా! నీ తలని నెగడికేసి పెట్టాలి, కాళ్లని కాదు.''

కుర్రాడు దానికిలా జవాబిచ్చాడు:

''మామ్మా, నువ్వు చెప్పేది నాకు బొత్తిగా బోధపడలేదు. నువ్వే ఆ షవల్ మీద ఓసారి కూర్చుని, నేనెలా కూర్చోవాలో చూపించకూడదూ?''

ఆ ముసలి మంత్రగత్తె తన శరీరాన్ని ముడిచి నెగడి దిశగా తలపెట్టి షవల్ మీద కూర్చుంది. కుర్రాడు చటుక్కున ముసలిదాన్ని నెగడిలోకి విసిరేశాడు!

అన్నాచెల్లెళ్లు యిప్పుడు సురక్షితంగా సంతోషంగా వున్నారు. వాళ్లు ఆ తిరగల్ని తీసుకుని, చెట్టు కాండం వెంట కిందకి దిగి, యింటికి పోయారు.

తిరగలి తమకు అట్లూ, కేకులూ చేసిపెడుతూండగా, ఎర్ర జుట్టు కోడి పుంజు తమకు సావాసం వుండగా, ఏ చీకూ చింతా లేకుండా, కాలాన్ని సరదాగా, సంతోషంగా గడపసాగారు!

కాని ఆనోటా యీనోటా పాకి యీ మాంత్రిక తిరగలి సంగతి ఓ రోజున రాజుగారి చెవిన పడింది. అతడు దాన్ని వెతికి పట్టుకు రమ్మని తన భటులకు ఆజ్ఞాపించాడు. వాళ్లు వచ్చి ఆ అన్నాచెల్లెళ్లనుంచి ఆ తిరగల్ని పట్టుకు చక్కాపోయారు.

పాపం ఆ చిన్నారి అనాధులకు ఉన్న ఆహారమంతా త్వరలోనే నిండుకోగా, వాళ్లు మళ్లీ ఆకలివాత బడ్డారు.

చెల్లెలూ, అన్నా కన్నీరు మున్నీరుగా ఏడ్చారు. కాని కోడి పుంజు వాళ్ల ఏడుపు విని, గుడిసె మధ్యగా ఠీవిగా వాళ్ల పక్కకి నడిచివెళ్లి యిలా అంది:

''క్లక్-క్లక్-క్లక్! నేను రాజు దగ్గర్నుంచి తిరగలి పట్టుకొచ్చేస్తాను కదా!''

అది రాజుగారిని కలిసేందుకు వెళ్లింది.

అది పోయి పోయి దోవలో ఓ ఎలుగుబంటిని కలిసింది.

''పుంజుబావా, పుంజుబావా నువ్వెక్కడి కెళ్తున్నావ్?'' అని అడిగింది ఆ ఎలుగుబంటి.

''రాజుగారి దగ్గర్నుంచి తిరగల్ని తిరిగి తీసుకొచ్చేందుకు. దాన్ని అతను ఓ యిద్దరు చిన్నారి అనాధులనుంచి కాజేశాడు.''

''నేనూ నీతో రావచ్చా?'' అడిగింది ఎలుగుబంటి.

''ఓ, దానికేం అలాగే రా! నా కుడి రెక్కకింద దూరు!''

ఎలుగుబంటి కోడి పుంజు కుడి రెక్కకింద దూరింది, కోడి పుంజు మళ్లీ తన దోవన బయల్దేరింది.

అది పోగా పోగా దోవలో దానికి ఓ తోడేలు కలిసింది.

''పుంజుబావా, పుంజుబావా, నువ్వెక్కడి కెళ్తున్నావ్?'' అడిగింది ఆ తోడేలు.

''రాజుగారి దగ్గర్నుంచి తిరగల్ని తిరిగి తీసుకొచ్చేందుకు, దాన్ని అతను ఓ యిద్దరు చిన్నారి అనాధులనుంచి కాజేశాడు.''

''నేనూ నీతో రావచ్చా?''

''ఓ, దానికేం అలాగేరా! నా ఎడమ రెక్కకింద దూరు, సరిపోతుంది.''





తోడేలు కోడి పుంజు ఎడమ రెక్కకింద దూరింది, కోడి పుంజు మళ్లీ తన దోవన బయల్దేరింది.

అది పోగా పోగా దోవ పక్కన దానికి ఓ చిన్న సరస్సు ఎదురైంది.

"పుంజుబావా, పుంజుబావా, నువ్వెక్కడికి వెళ్తున్నావ్?" అడిగింది ఆ సరస్సు.

"రాజుగారినుంచి తిరగల్ని తిరిగి తీసుకొచ్చేందుకు. దాన్ని అతను ఓ యిద్దరు చిన్నారి అనాథులనుంచి కాజేశాడు."

"నేనూ నీతో రావచ్చా?"

"ఓ, దానికేం, అలాగేరా, నువ్వు నా గొంతుతిత్తిలో సరిగ్గా సరిపోతావు."

కోడి పుంజు సరస్సులో నీటినంతనీ పీల్చేసి, మళ్లీ తన దోవన బయల్దేరింది.

అది జారు భవనాన్ని చేరుకుని, అతని పడకగది కిటికీకింద జేరి, యిలా కుయ్యసాగింది:

"నేనో కోడి పుంజుని, అయితేనేం నాకు ఎర్ర జుట్టు వుంది. క్రూరుడైన జారుకి అలాంటిదేమీ లేదు! ఓ యిద్దరు చిన్నారి పేద అనాథులనుంచి వాళ్ల తిరగలిని కాజేసి, వాళ్లు ఆకలితో అలమటిస్తూంటే తను దర్జాగా విందులు కుడుస్తున్నాడు."

రాజుగారికి పట్టరాని కోపంవచ్చి, ఆ కోడిపుంజుని తరిమెయ్యమని తన భటులకి ఆజ్ఞాపించాడు. కాని ఆ కోడి పుంజు వాళ్లకి దొరక్కుండా గెంతి, మళ్లీ యిలా కూసింది:

"నేనో కోడి పుంజుని, అయితేనేం నాకు ఎర్ర జుట్టు వుంది. క్రూరుడైన రాజుకి అలాంటిదేమీ లేదు! ఓ యిద్దరు చిన్నారి పేద అనాథులనుంచి వాళ్ల తిరగలిని కాజేసి, వాళ్లు ఆకలితో అలమటిస్తూంటే, తను దర్జాగా విందులు కుడుస్తున్నాడు."

అప్పుడు ఆ కోడి పుంజుని పట్టుకుని గుర్రాలసాలలో పడేసి తన పొగరుబోతు గుర్రాలచేత తొక్కించి చంపమని తన భటులకు ఆ రాజు ఆజ్ఞాపించాడు. రాజభటులు ఆ కోడి పుంజును పట్టుకుని, దాన్ని గుర్రాలసాలలోకి విసిరేశారు. కాని కోడి పుంజు తన కుడిరెక్కకింద వున్న ఎలుగుబంటిని వదిలిపెట్టింది. ఆ ఎలుగుబంటి గుర్రాలన్నింటినీ వరసబెట్టి చంపేసింది.

మరుసటి రోజు ఉదయం రాజభటులు గుర్రాలసాల దగ్గరకి వచ్చి తలుపు తెరిచారు. కోడి పుంజు తుర్రున బయటికి ఎగిరివచ్చి, రాజుగారి పడకగది కిటికీకింద జేరి యిలా కూసింది:

"నేనో కోడి పుంజుని, అయితేనేం నాకు ఎర్ర జుట్టు వుంది. క్రూరుడైన రాజుకి అలాంటిదేమీ లేదు! ఓ యిద్దరు చిన్నారి పేద అనాథులనుంచి వాళ్ల తిరగలిని కాజేసి, వాళ్లు ఆకలితో అలమటిస్తూంటే, తను దర్జాగా విందులు కుడుస్తున్నాడు."

అది విన్న జారు మండిపడి, ఆ కోడి వుంజుని పట్టుకుని గొర్రెల కొట్టంలో పడేసి, పొగరుబోతు గొర్రె పొట్టేళ్లచేత దాన్ని తొక్కించి చంపించమని తన భటులకి ఆజ్ఞాపించాడు.

రాజభటులు అతను చెప్పినట్లే చేశారు, అయినా ఆ కోడి పుంజు భయపడలేదు. అది తన ఎడమ రెక్కకిందనుంచి తోడేలుని కొట్టంలో వదిలింది. ఆ తోడేలు కొట్టంలోని గొర్రెపొట్టేళ్లన్నింటినీ చంపిపారేసింది.





మరుసటి రోజు ఉదయం రాజభటులు గుర్రాలసాల దగ్గరకి వచ్చి చూశారు. కోడి పుంజు తుర్రున బయటకి ఎగిరివచ్చి, జారు పడకగది కిటికీకింద జేరి యిలా కూసింది:

"నేనో కోడి పుంజుని, అయితేనేం నాకు ఎర్ర జుట్టు వుంది. క్రూరుడైన రాజుకి అలాంటిదేమీ లేదు! ఓ యిద్దరు చిన్నారి పేద అనాథులనుంచి వాళ్ల తిరగలిని కాజేసి, వాళ్ళ ఆకలితో అలమటిస్తూంటే, తను దర్జాగా విందులు కుడుస్తున్నాడు."

ఈ కోడి పుంజు పీడ ఎలా వదిలించుకోవడమో బోధపడక, రాజుగారు కోపంతోనూ, నిస్సహాయతతోనూ కుతకుతలాడిపోయాడు.

అతను తన భటుల్ని పిలిచి, తన యినుప స్నాన గృహాన్ని కణకణ మండేలా వేడిచేసి, కోడి పుంజుని అందులో పడేసి మాడ్చి చంపాల్సిందిగా ఆజ్ఞాపించాడు.

రాజభటులు ఆ కోడి పుంజును వేడి స్నానగృహంలోకి విసిరేశారు. కాని ఆ కోడి పుంజు తన గొంతుతిత్తిలో వున్న నీటినంతనీ పైకి వదిలేసింది, దానితో చూసుకో నాయనా! — స్నానగృహమంతా నీళ్లతో నిండిపోయి, చల్లగా హాయిగా తయారైంది.

మరుసటి రోజు ఉదయం రాజభటులు స్నానగృహానికి వచ్చి తలుపు తెరిచారు. కోడి పుంజు రయ్యన బయటికి దూసుకొచ్చి, రాజభవనానికి ఎగిరివెళ్లి, రాజు పడకగది కిటికీకింద కూర్చుని యిలా కూసింది:

"నేనో కోడి పుంజుని, అయితేనేం నాకు ఎర్ర జుట్టు వుంది. క్రూరుడైన రాజుకి అలాంటిదేమీ లేదు! ఓ యిద్దరు చిన్నారి పేద అనాథులనుంచి వాళ్ల తిరగలిని కాజేసి, వాళ్ళ ఆకలితో అలమటిస్తూంటే తను దర్జాగా విందులు కుడుస్తున్నాడు."

ఈ కోడి పుంజు పీడ ఎలా వదిలించుకోవడమబ్బా అన్న ఆలోచనతో రాజుగారి తల గిర్రున తిరగ సాగింది. అతను తన భటుల్ని పిలిచి, కోడి పుంజుని పట్టుకుని ఉదయపు ఫలహారం వండిపెట్టమని ఆజ్ఞాపించాడు. కాని యీలోగా తన కోపాన్ని దిగమింగుకోలేక, దాన్ని పట్టుకుని బతికివున్నదాన్ని ఉన్నట్లుగానే మింగేశాడు.

ఆ కోడి పుంజు రాజు కడుపులోంచే యిలా కుయ్యసాగింది:

"నేనో కోడి పుంజుని, అయితేనేం నాకు ఎర్ర జుట్టు వుంది. క్రూరుడైన రాజుకి అలాంటిదేమీ లేదు! ఓ యిద్దరు చిన్నారి పేద అనాథులనుంచి వాళ్ల తిరగలిని కాజేసి, వాళ్ళ ఆకలితో అలమటిస్తూంటే తను దర్జాగా విందులు కుడుస్తున్నాడు."

రాజుగారు కోడి పుంజుని ప్రాధేయపడటం మొదలుపెట్టాడు.

"చిన్నారి కోడి పుంజూ, నీకు పుణ్యం వుంటుంది, నువ్వు నా కడుపులోంచి బయటకొచ్చి నా మానాన నన్నొదిలెయ్. మళ్లీ నీ జోలికొస్తే ఒట్టు" అన్నాడతను.

"ఆ చిన్నారి అనాథులిద్దరికీ వాళ్ల తిరగలిని నువ్వు తిరిగి యిచ్చేసేదాకా నేను బయటికి రానుగాక రాను!" అంది కోడి పుంజు.


అని మళ్లీ అది కుయ్యడం మొదలుపెట్టింది:

"నేనో కోడి పుంజుని, అయితేనేం నాకు ఎర్ర జుట్టు వుంది. క్రూరుడైన రాజుకి అలాంటిదేమీ లేదు! ఓ యిద్దరు చిన్నారి పేద అనాధులనుంచి వాళ్ల తిరగలిని కాజేసి, వాళ్లు ఆకలితో అలమటిస్తూంటే తను దర్జాగా విందులు కుడుస్తున్నాడు."

జనం గుమిగూడి ఆ పాట విని క్రూరుడైన రాజుగారిని చూసి నవ్వసాగారు. ఇక చేసేదేమీలేక క్రూరుడైన రాజు అనాధ బాలబాలికలకు వాళ్ల తిరగలిని తిరిగి యిచ్చేశాడు. పోతే యిక కోడి పుంజు సంగతి, అది జారు కడుపులోంచి బయటికి ఉరికి, పరుగున యింటికి తుర్రుమంది.

అన్నాచెల్లెళ్లు దాన్ని చూసి అపరిమితానందం పొందారు. ఆనాటినుంచి వాళ్లు ముగ్గురూ కలిసి సంతోషంగా రోజులు గడిపారు. ఆ తిరగలి బోలెడు బోలెడు అట్లూ, కేకులూ యిచ్చేదేమో వాళ్లకి మళ్లీ ఆకలిబాధ లేకుండా పోయింది. అంతేకాదు, తాము తినగా, తమలాంటి యితర పేదజనానికి కూడా యిన్ని పెట్టేందుకు ఎప్పుడూ అవి సమృద్ధిగా వుండేవి.





అనువాదం: నిడమర్తి ఉమారాజేశ్వరరావు
చిత్రాలు: కె. ఒవ్చిన్నికొవ్

Петушок с красным гребешком

На языке телугу

The Cock with the Crimson Comb

in Telugu

సోవియట్ యూనియన్‌లో ముద్రింపబడింది

